ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 15-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

ముఖ్యాంశాలు

- దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎర్రకోటపై జాతీయ జెండాను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆవిష్కరించారు.

- భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు.

- గత ఎనిమిది దశాబ్దాల కాలంలో భారత్ ఎన్నో కఠినమైన సవాళ్లను అధిగమించిందని, అయితే సాధించాల్సింది ఇంకా ఎంతో ఉందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.

- అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో రేపటి వరకు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం వుండటంతో భారత వాతావరణ విభాగం (IMD) 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకం (నేషనల్ వార్ మెమోరియల్) వద్ద వీర జవాన్లకు నివాళులర్పించారు. అక్కడ పుష్పగుచ్ఛం ఉంచి అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల వారసత్వాన్ని గౌరవిస్తూ, వికసిత భారత్ లక్ష్యానికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. దేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న సందర్భంగా ఒక ఆంగ్ల దినపత్రికలో రాసిన వ్యాసంలో ఆయన భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న అజ్ఞాత యోధుల ధైర్యసాహసాలు, త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోట వద్ద ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తొలిసారిగా ఎర్రకోటపై "వందేమాతరం" ఆలాపన జరగడం ఈసారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ.. గత 12 ఏళ్లలో కోట్ల మంది పౌరుల పట్టుదలతో దేశం కొత్త శిఖరాలను అధిరోహించిందని తెలిపారు. ఒకప్పుడు బలహీనమైన ఆర్థిక వ్యవస్థల జాబితాలో ఉన్న భారత్, నేడు ప్రపంచంలోనే వేగంగా ఎదుగుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు. ఈ కృషి ఫలితంగానే 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని, 2047 నాటికి భారత్‌ను సంపూర్ణ అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని నరేంద్రమోదీ స్పష్టం చేస్తూ...

(వాయిస్…32 సెకన్లు)

అదేవిధంగా.. చమురు నిల్వల అన్వేషణను ముమ్మరం చేశామని, 2047 నాటికి 100 గిగావాట్ల అణుశక్తి సామర్థ్యాన్ని సాధించడమే లక్ష్యంగా 5 కొత్త అణు రియాక్టర్లను ప్రారంభించనున్నామని నరేంద్రమోదీ వెల్లడించారు. రాబోయే ఏడాది కాలంలో కోటి మంది యువతకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) లో శిక్షణ ఇస్తామని, అలాగే పేద, మధ్యతరగతి విద్యార్థుల కోసం పోటీ పరీక్షలకు ప్రముఖ అధ్యాపకులతో ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తామని ప్రకటించారు. క్రీడారంగాన్ని ప్రోత్సహించేందుకు 5 నుంచి 15 ఏళ్ల చిన్నారుల కోసం 'టాలెంట్ హంట్' నిర్వహిస్తామని, 2030లో భారత్ కామన్‌వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వనుందని పేర్కొన్నారు. పార్లమెంట్, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలుకు అన్ని పార్టీలు ఏకగ్రీవంగా మద్దతు ఇవ్వాలని ప్రధానమంత్రి కోరుతూ...

(వాయిస్…21 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

గత ఎనిమిది దశాబ్దాల కాలంలో భారత్ ఎన్నో కఠినమైన సవాళ్లను అధిగమించిందని, అయితే సాధించాల్సింది ఇంకా ఎంతో ఉందని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజేఐ) జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సుప్రీంకోర్టు ప్రాంగణంలో నిర్వహించిన త్రివర్ణ పతాకావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత గణతంత్రంతో పాటు దేశ చట్ట, న్యాయ వ్యవస్థలు కూడా ఎంతో పరిణితి సాధించాయని, దేశ అంతరాత్మను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాయని తెలిపారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో న్యాయవాద వృత్తి అంతర్భాగంగా నిలిచిందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లు వైభవంగా నిర్వహించాయి. సింగపూర్, చైనా, హాంగ్‌కాంగ్‌లలో వేలాది మంది ప్రవాస భారతీయులు జాతీయ పతాకావిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. సింగపూర్ భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే 2వేల 500 మందికి పైగా ప్రవాసుల సమక్షంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. చైనాలోని భారత రాయబార కార్యాలయంలో ప్రవాస భారతీయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రాయబారి విక్రమ్ దొరైస్వామి జాతీయ జెండాను ఎగురవేశారు. హాంగ్‌కాంగ్ లో 'ఇండియన్ అసోసియేషన్' ఆధ్వర్యంలో జరిగిన వేడుకకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ జాన్ లీ కా-చియు, కాన్సుల్ జనరల్ రాజేష్ నాయక్ హాజరయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

పన్ను చెల్లింపుదారుల కోసం కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (CBDT) 'చిన్న పన్ను చెల్లింపుదారుల విదేశీ ఆస్తుల వెల్లడి పథకం (FAST-DS) నిబంధనలు - 2026'ను ప్రకటించింది. అర్హులైన పన్ను చెల్లింపుదారులు తమ వద్ద ఉన్న అప్రకటిత విదేశీ ఆస్తులు లేదా విదేశీ ఆదాయాన్ని నిర్ణీత పన్ను లేదా రుసుము చెల్లించి స్వచ్ఛందంగా వెల్లడించేందుకు ఈ పథకం అవకాశం కల్పిస్తుంది. ఈ పథకం రేపటి నుంచి అమలులోకి రానుండగా, దరఖాస్తు చేసుకోవడానికి ఈ ఏడాది డిసెంబరు 31 చివరి తేదీగా నిర్ణయించారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారత్ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రపంచ దేశాల నేతలు, విదేశీ దౌత్య అధికారులు దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలిపిన ప్రపంచ నేతలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ధన్యవాదాలు తెలియజేశారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మేక్రాన్, మాల్దీవుల అధ్యక్షుడు డాక్టర్ మహమ్మద్ మొయిజ్జు తదితర నేతలకు సామాజిక మాధ్యమం వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. నేపాల్ ప్రధానమంత్రి బలేంద్ర షా శుభాకాంక్షలకు స్పందిస్తూ.. భారత్-నేపాల్ మధ్య శతాబ్దాలుగా కొనసాగుతున్న బహుముఖ, నాగరికతా బంధాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు తాము కట్టుబడి ఉన్నామని నరేంద్రమోదీ పేర్కొన్నారు. భూటాన్ ప్రధాని షెరింగ్ తోబ్గే పంపిన సందేశానికి ప్రధానమంత్రి బదులిస్తూ.. భూటాన్‌తో భారత్‌కు ఉన్న ప్రత్యేకమైన, శాశ్వత భాగస్వామ్యాన్ని ఎంతో విలువైనదిగా భావిస్తున్నామని, ఈ బంధం రోజురోజుకూ మరింత బలపడుతోందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఇండోనేషియాలోని ఫ్లోర్స్ తీర ప్రాంతంలో సంభవించిన భారీ భూకంపం ధాటికి మృతుల సంఖ్య 38కి చేరింది. ప్రధాన భూకంపం అనంతరం నమోదైన పదుల సంఖ్యలోని ప్రకంపనలు స్థానికులను భయాందోళనలకు గురిచేశాయి. భూకంపం ప్రభావంతో సముద్రంలో ఒక మీటర్ కంటే తక్కువ ఎత్తులో సునామీ అలలు ఎగసిపడ్డాయి. అయితే ప్రమాదం లేకపోవడంతో దాదాపు మూడు గంటల తర్వాత అధికారులు సునామీ హెచ్చరికలను ఉపసంహరించుకున్నారు. శిథిలాల కింద నుంచి రెస్క్యూ బృందాలు ఇప్పటివరకు 20 మృతదేహాలను వెలికి తీశాయి.

= = = = = = = = = = = = = = = = = = =

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా వినూత్న రీతిలో 'సూర్యపథ్ తిరంగ్' గ్లోబల్ రిలేను నిర్వహిస్తున్నారు. సూర్యోదయమ్ దిశను అనుసరిస్తూ ప్రపంచ దేశాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం ఈ కార్యక్రమ ప్రత్యేకత. 'హర్ ఘర్ తిరంగా-2026' వేడుకల్లో భాగంగా కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. జర్మనీ, నెదర్లాండ్స్, ఇటలీ, ఈజిప్ట్, లాత్వియా, దక్షణాఫ్రికాలోని భారత రాయబార కార్యాలయాలు ప్రవాస భారతీయులను ఈ వేడుకలో భాగస్వామ్యం చేస్తున్నారు. వివిధ టైమ్ జోన్ల ప్రకారం తూర్పున సూర్యోదయం అయ్యే మొదటి దేశం నుంచి ప్రారంభమై.. పశ్చిమ దేశాల వైపు వరుసగా ఒకదాని తర్వాత మరొక భారతీయ దౌత్య కార్యాలయంలో క్రమపద్ధతిలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

గాలె ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా శ్రీలంక, భారత్ మధ్య జరుగుతున్న తొలి టెస్టు క్రికెట్ మ్యాచ్ లో మొదటి రోజు ఆట ముగిసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమ్ఇండియా ఆట ముగిసేసమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

అరుణాచల్ ప్రదేశ్, గంగానది పరివాహక పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో రేపటి వరకు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం వుండటంతో  భారత వాతావరణ విభాగం (IMD) 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. వచ్చే రెండు మూడు రోజుల్లో ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ-కశ్మీర్, లద్దాఖ్, ఝార్ఖండ్, కొంకణ్, గోవా, మధ్య మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = =